www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 ఏప్రిల్ 2024 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- తొలిరోజు 19 మంది అభ్యర్థుల దాఖలు
- 'తూర్పు'లో ఆరుగురు, కాకినాడలో ఐదుగురు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 8 మంది

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తొలిరోజు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎనిమిది మంది, తూర్పు గోదావరి జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో ఐదుగురు నామినేషన్లను వేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకూ నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్లను స్వీకరించే రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మీడియాను సైతం కార్యాలయాల్లోకి అనుమతి నిరాకరించారు. వివిధ పార్టీల తరుపున నామినేషన్లు వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కార్యాలయాల్లోకి అనుమతించారు. స్వతంత్ర అభ్యర్థులతో పాటు పదిమందిని కార్యాయలయాల్లోకి అనుమతించారు. తొలిరోజు నామినేషన్లు వేసిన వారిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోకవర్గానికి పిల్లా సూర్యప్రకాశరావు, పిల్లి సుభాష్ చంద్రబోస్ నామినేషన్లు వేశారు. వారి వెంటె ఎంఎల్ఎ తోట త్రిమూరులు ఉన్నారు. అలాగే అమలాపురం నుంచి జనసేన నాయకుడు చీకురుపల్లి కిరణ్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రం సిటీ నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థిగా ఆదిరెడ్డి శ్రీనివాసరావు, ఆయన భర్త, సిట్టింగ్ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని నామినేషన్లు వేశారు. కొవ్వూరు నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకటేశ్వరావు, ఆయన భార్య తలారి పరంజ్యోతి నామినేషన్ వేశారు. నిడదవోలులో సిట్టింగ్ ఎంఎల్ఎ జి.శ్రీనివాసనాయుడు వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గోపాలపురం నియోజక వర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా మద్దిశెట్టి వెంకట్రాజు నామినేషన్ దాఖలు చేశారు.

కాకినాడ జిల్లాలో మొదటి రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4 నామినేషన్లు, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ వేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి అన్నవరం పితాని ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒక సెట్, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి టేకుమూడి శ్రీనివాసరావు, వినుకొండ వెంకటేశ్వరరావు, మట్ట వెంకటేశ్వరరావులు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా భవాని శంకర్‌ప్రసాద్ మెర్ల రెండు సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు.

రామచంద్రపురంలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వైసిపి అభ్యర్థి సూర్యప్రకాష్

ప్రజలకు జగన్ అభివాదం

ప్రసంగాలు లేకుండానే...

- 'తూర్పు'లో ముగిసిన సిఎం రోడ్‌షో
- 16 కిలోమీటర్ల మేర సాగిన యాత్ర
- పలువురు వైసిపిలో చేరిక, రాత్రికి జిల్లాలోనే సిఎం బస

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం చేపట్టిన 'మేమంతా సిద్ధం' రోడ్ షో ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి ప్రసంగాలు లేకుండానే జగన్ తన 17వ రోజు యాత్రను ముగించారు. విజయవాడలో సిఎంపై జరిగిన దాడి నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాయి. మొబైల్ కమాండింగ్ వాహనాన్ని సైతం ఏర్పాటు చేశారు. రోడ్ షో పొడువునా ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో రోడ్ షో ప్రశాంతంగా ముగిసింది. దీంతో అధికారి యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తణుకు నుంచి బస్సు యాత్ర గురువారం మధ్యాహ్నానికి రావులపాలెంలో ప్రవేశించింది. కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పలువురు వికలాంగులు, మహిళలు, వృద్ధులను పలుకరిస్తూ ప్రజలకు అభివాదాలు చేస్తూ యాత్రను ముగించారు. సాయంత్రం ఐదు గంటలకు వేమగిరికి చేరుకున్న ఆయనకు ఎంపీ భరత్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం బొమ్మూరు జంక్షన్ వద్ద ప్రజలకు అభివాదం చేసి, అక్కడ నుండి నగరంలోని మోరంపూడి జంక్షన్‌కు చేరుకున్నారు. ఎంపీ భరత్ కార్యాలయం మీదుగా నగరంలో 22 వార్డుల గుండా యాత్ర సాగింది. అనంతరం గామన్ బ్రిడ్జి మీదుగా రాజానగరం మండలంలో యాత్ర ప్రవేశించింది. రాజానగరంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి స్వాగతం పలికారు. విజయలక్ష్మితో ఈ సందర్భంగా సిఎం కాసేపు ముచ్చటించారు. అనంతరం ఎస్‌టి.రాజపురంలో ఆయన యాత్ర ముగిసింది. రాత్రికి 2లో..

కౌలు రైతు ఆత్మహత్య

ఆత్రేయపురం : నష్టాల ఊబిలో కూరుకుపోయిన కౌలు రైతు గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కోట సత్యనారాయణ (24) తండ్రి చనిపోవడంతో తల్లి వద్దనే ఉంటూ కౌలు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం రూ.10 లక్షలు అప్పు చేసి అరటి తోట వేశాడు. సరిగా పంట దిగుబడి రాకపోయేసరికి నష్టాల ఊబిలో కూరుకు పోయాడు. చేసిన అప్పు తీరక మళ్లీ ఎక్కడా అప్పు దొరక్క మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల బాధ తట్టుకోలేక గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇతనిని సోదరుడు వెంకన్న రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో సత్యనారాయణ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

యువకుల మృతదేహాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-రాజమహేంద్రవరం ఎడిబి రోడ్డులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టి ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇంజినీరింగ్ చదువుతూ రామేశ్వరంపేటలోని రూమ్‌లో ఉంటున్న విద్యార్థులు గురువారం బైకుపై పెద్దాపురం వచ్చి తిరిగి బైక్‌పై రూముకి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లికి చెందిన లాలం సతీష్(20), విశాఖపట్నంకు చెందిన బర్రి మాధవకుమార్(19) అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన రామచంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన రామచంద్రరావుని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్టూ'నిజం'



వ్యయ పరిశీలకులతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ జె.నివాస్

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాద్దిక్ అహ్మద్ కలెక్టర్ జె.నివాస్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు యోగేష్ కుమార్, పెద్దాపురం, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఎ.ఆషీఫ్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.నివాస్ వ్యయ పరిశీలకులకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యయ పరిశీలకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ఎన్నికల ఎఫ్ఎస్‌టి బృందంతో గురువారం కలెక్టర్ మాధవీలత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాలో 7 నియోజకవర్గాల స్థాయిలో 63 బృందాలు మూడు షిఫ్ట్‌లలో విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. వీటికి అదనంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో పది మంది సభ్యులతో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందానికి సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశామని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత ఖచ్చితత్వంతో విధులను చేపట్టాల్సి ఉందన్నారు. గతేడాది ఇదే రోజున లిక్కర్‌కు సంబంధించిన ఏ రకం ఎంత లావా దేవీలు జరిగాయి, అదే విధంగా వివిధ ఫ్రీబిస్, వస్తువుల వినిమయం ఎంత ఉంది షాపుల వారీగా, ఏరియా వారీగా గణాంకాలు తనిఖీ చెయ్యాల్సి ఉందన్నారు. ఇన్‌కంట్యాక్స్, జిఎస్‌టి, ఎస్ఎస్‌టి శాఖల ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించి ఆ మేరకు చేపట్టాల్సిన చర్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా ఎఫ్ఎస్‌టి బృందాలు తనిఖీలు నిర్వహించిన వాటి వివరాలు ఎప్పటికప్పుడు రిపోర్ట్ చెయ్యడం అత్యంత అవసరం అని తెలిపారు. జిల్లాలో ఉన్న 5 డిస్టరీలు, ఒక బ్రెవరీల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై సమగ్ర సమాచారం సేకరించి, అధ్యయనం చేయ్యాలన్నారు. అమ్మకాలను నియంత్రించే క్రమంలో సీలింగ్ పద్ధతిని అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర కార్యచరణ రూపొందించడం ద్వారా నియంత్రణా చర్యలు తీసుకోవడం సాధ్యం అవుతుందని తెలిపారు. మొత్తం జిల్లావ్యాప్తంగా జిల్లా స్థాయి ఎఫ్ఎస్‌టి బృందం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రణాళికలు, తనిఖీలు జవాబుదారీతనంతో కూడి విధులను నిర్వర్తించడం చాలా ముఖ్యం అన్నారు. ఈ సమావేశంలో సహాయ కలెక్టర్, డిఎఫ్ఎస్‌టి నోడల్ అధికారి సి.యశ్వంత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భాను ప్రకాష్, ఎక్సైజ్, ఎస్ఎస్‌టి, జిఎస్‌టి, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-చాగల్లు

వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బంది నివారణకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకూ పైపులైన్ ద్వారా తాగునీరు వదులుతామని పంచాయతీ గ్రామ కార్యదర్శి ఎల్.రవికుమార్ తెలిపారు. గ్రామంలో ఎవరైనా ఈ సమయంలో పైపుల నుంచి మోటారుతో మంచినీళ్లు తోడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు.

జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు జై అరవింద్ గోవింద్ రాజన్ జిల్లాకు వచ్చారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం స్థానిక రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారితో తమిళనాడుకు చెందిన అధికారి జై అరవింద్ గోవింద్ రాజన్ పార్లమెంట్ నియోజక వర్గ, జిల్లా అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఖర్చుల అంచనా వివరాలు, రికార్డులు నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

కొవ్వూరు తరలిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-చాగల్లు

మండలానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు గురువారం వైసిపి మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, ఎంపిపి మట్టా వీరాస్వామి ఆధ్వర్యంలో భారీగా కొవ్వూరు తరలి వెళ్లారు. వైసిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి తలారి వెంకట్రావు నామినేషన్ వేస్తున్న సందర్భంగా కొవ్వూరు తరలి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరుణకుమారిని గెలిపించాలి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. గురువారం కొవ్వూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అరుణకుమారిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థి అరుణ కుమారి విజయానికి కార్మికులు కర్షకులు విద్యార్థులు ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీపరం ఆపాలన్నా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలపై దాడులు ఆగాలన్నా ఇంటియా కూటమిని గెలిపించాలన్నారు. 2014లో తిరుపతి వెంకన్న సాక్షిగా మోడీ, చంద్రబాబు హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొవ్వూరును మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రుపు రాంబాబు, రాజమండ్రి నగర కార్యదర్శి వి.కొండలరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి సుధీర్, కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా సాంస్కృతిక ఉత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో వార్షిక సాంస్కృతిక ఉత్సవం ఉద్భవ్-2024ను గురువారం కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ప్రారంభించారు. విద్యార్థులకు సంపూర్ణ విద్యా అనుభవాన్ని అందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వినోద కార్యక్రమాలతో విద్యాపరమైన కఠినతను సమతుల్యం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యార్థులకు సాంస్కృతిక పోటీల ద్వారా వారి విభిన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఒక శక్తివంతమైన వేదికగా పని చేస్తుందని, స్టాల్స్ నిర్వహణ ద్వారా వారి వ్యవస్థాపక చతురతను మెరుగు పరుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పండుగలను నిజమైన వేడుకల స్ఫూర్తితో నింపాలని విద్యార్థులను కోరారు. ఆహారం, గేమ్ స్టాల్స్‌ను స్థాపించడానికి ఆర్థిక నష్టాలను చేపట్టడంలో విద్యార్థుల ధైర్యాన్ని కొనియాడారు. మూడు రోజుల పాటు జరిగే వార్షిక సాంస్కృతిక ఉత్సవానికి సంబంధించిన భావనను రూపొందించి అవిశ్రాంతంగా అమలు చేసినందుకు ఫిలాసఫీ లెక్చరర్ సత్యం సూర్యనారాయణ, సైకాలజీ లెక్చరర్ జి.రాకేష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాజమండ్రిలోని వివిధ ప్రాంతాలలో ఓటరు అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వ కళాశాల (ఎ), రాజమండ్రి విద్యార్థుల ప్రభావవంతమైన ఫ్లాష్ మాబ్‌లను రాజమండ్రి మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీశైలశాస్త్రి ఈ సాంస్కృతిక ఉత్సవం ఇతర విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని, ఇంకా అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అకడమిక్ కో ఆర్డినేటర్ డి.సంజీవ్ కుమార్, ఇంగ్లిష్ లెక్చరర్ ఎన్.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ఉత్సవాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్‌కె

టిడిపిలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

టిడిపిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి-గోకవరం

గుమ్మళ్లదొడ్డిలో టిడిపి గ్రామ అధ్యక్షుడు నాగులపాటి నారాయణ కుమార్, బొడ్డేటి శివాజీ, వేగి సత్తిబాబు ఆధ్వర్యంలో సుమారు 60 మంది టిడిపిలో చేశారు. పార్టీ జగ్గంపేట నియోజకవర్గం అభ్యర్థి జ్యోతుల నెహ్రూ వీరికి నెహ్రూ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంగరౌతు రామకృష్ణ, కన్నబాబు, దాసరి తమ్మన్న దొర, గాజింగం సత్తిబాబు, జనపరెడ్డి సుబ్బారావు, అడపా భరత్, గుండా శివప్రసాద్, కోట సూరిబాబు, సత్యవతి, విడుదల అర్జునరావు, పిల్ల అర్జున సారధి, ఉంగరాల గణేష్, ఎం.మంగరాజు, బి.వెంకన్న బాబు, పాల్గొన్నారు.

పలుచోట్ల జోరుగా అభ్యర్థుల ప్రచారం

వివిధ నియోజకవర్గాల్లో పలువురు అభ్యర్థులు గురువారం జోరుగా ప్రచారం చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

చాగల్లు మండలంలోని మార్కొండపాడు పంచాయతీ శివారు కుంకుడుమిల్లిలో బాబు ష్యూరిటీ సూపర్ సిక్స్ పథకాలను టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు వివరించారు. అనంతరం కొత్త పాటమ్మ గుడి వద్ద టిడిపి సీనియర్ నాయకుడు పెంజల అచ్చబాబు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు కొటారు అశోక బాబా, లంకసాని శ్రీనివాసరావు, అచ్చిబాబుకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆళ్ల హరిబాబు, కేతాసాహెబ్, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి పాల్గొన్నారు.

గోకవరం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపు తథ్యమని వైసిపి జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం తనయుడు తోట రామ్‌జీ అన్నారు. గోకవరం మండలం కామరాజుపేట ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట రామ్‌జీ మాట్లాడారు. సిఎం వైఎస్.జగన్ ఆధ్వర్యాన ప్రతి గ్రామంలో రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రతి గడపలో రూ.లక్షలతో సంక్షేమ పథకాలను ఎవరికీ ఎటువంటి లంచం ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారులకు మేలు చేకూర్చినట్టు తెలిపారు. లక్షలాదిమందికి ఇళ్ల స్థలాలు పట్టాలు అందించడమే గాక పరిపాలన వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చి పేదవాడికి మంచి చేసిన ఘనత వైఎస్.జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, వైద్య రంగం, పర్యటక రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చి ప్రతి రంగం సర్వతోముఖాభివద్ధి చెందాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు.

పెరవలి బిఎస్‌పి ఎంఎల్‌ఎ అభ్యర్థి చిత్రసేన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ సభలు, ర్యాలీలను విజయవంతం చేసుకోవడానికి, జనాన్ని తరలించుకోవడానికి విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిర్రా రాజు, నల్లి రమేష్, చల్లాబత్తుల సత్యనారాయణ, బత్తిన ఆశీర్వాదం, మర్రి మహాలక్ష్ముడు, కప్పల ఇశ్రాయిల్, చిన్నం వెంకటేశ్వరరావు, మోర్త చింతరాజు తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

పెరవలిలో ప్రచారం చేస్తున్న బిఎస్‌పి నాయకులు

ప్రసంగాలు లేకుండానే...

(మొదటి పేజీ నుంచి)

సిఎం ఈ గ్రామంలోనే బస చేయనున్నారు. శుక్రవారం యాత్ర కాకినాడ జిల్లాలో సాగనుంది. జిల్లాలో మొత్తంగా ఆయన 16 కిలోమీటర్ల మేర యాత్రను సాగించారు.

వైసిపిలో చేరిన బొంతు రాజేశ్వరరావు

రాజోలు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బొంతు రాజేశ్వరరావు జగన్ సమక్షంలో గురువారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. రావులపాలెంలో ఎంఎల్‌ఎలు చిర్ల జగ్గిరెడ్డి, రాపాక వరప్రసాదరావు సమక్షంలో సిఎం జగన్ ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానంచారు. బొంతు రాజేశ్వరరావ రాజోలు నుంచి జనసేన తరుపున టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. అప్పటి నుంచి ఆయన అసంతృప్తిలో ఉన్నారు. నేడు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాల సరస్వతి

ఉసులుమర్రులో బేటీ బచావో..

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి ఐసిడిసి ప్రాజెక్ట్ పరిధి కానూరు సెక్టార్ ఉసులుమర్రు ప్రాథమిక పాఠశాలలో గురువారం బేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం కానూరు సెక్టార్ సూపర్వైజర్ ఎం.బాలసరస్వతి మీటింగ్ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా బాల సరస్వతి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకుందాం ఆడపిల్లలను చదివించుకుందాం అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీచంద్రిక, కె.శ్రీదేవి జి.భాగ్యలక్ష్మి అంగన్వాడీ టీచర్ కె.కృష్ణవేణి, డి.సత్యవతి, పాల్గొన్నారు.

వంగా గీతకు స్వల్ప అస్వస్థత

ప్రజాశక్తి - పిఠాపురం

అస్వస్థతకు గురైన గీతకు వైద్యం అందిస్తున్న వైద్యులు

వైసిపి నియోజకవర్గ అభ్యర్థిని వంగా గీత స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం మండలంలోని ఎఫ్‌కె పాలెం, కందరాడ గ్రామంలో ఎంఎల్ఎ దొరబాబుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజలను కలిసి ఓటర్లను తనకు మద్దతు తెలపాలని రాబోయే ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎంఎల్ఎగా తనకు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎండ వేడిమిని తాళలేక ఆమె స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రచారం మధ్యలోనే నిలిపివేసి ఆమెను పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చారు. వెంటనే వైద్యులను పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. వైద్య పరీక్షల అనంతరం డాక్టర్లు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల వల్ల డిహైడ్రేషన్ గురయ్యి వడదెబ్బ తగిలిందన్నారు. ఆమెకు అన్ని విధాల విశ్రాంతి అవసరమని అధిక ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవలన్నారు. కనీసం 48 గంటలు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు.

నేడు యానాంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

ఇవిఎంలతో బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది

పుదుచ్చేరి ఏకైక పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి శుక్రవారం యానాంలో పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి ఆధ్వర్యంలో ఆయా ఏర్పాట్లు పూర్తి చేశారు. యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 33 పోలింగ్ బూత్‌లు సిద్ధం చేయగా ఆయా బూత్ లకు గురువారం ఇవిఎంలు, ఇతర సామాగ్రితో ఎన్నికల సిబ్బందిని బస్సులలో తరలించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో 144 సెక్షన్ విధించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను, 7 సెక్టార్ బృందాలను ఏర్పాటు చేశారు. యానాం నియోజకవర్గంలో 39 వేల 408 మంది ఓటర్లు ఉన్నారు.

టిడిపి సభ్యత్వానికి రాజీనామా

ప్రజాశక్తి - కరప

మండలంలోని వేళంగి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, గ్రామ అధ్యక్షుడు పురం సత్యప్రసాద్‌రావు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 1989 నుంచి తాము టిడిపిలోనే కొనసాగామని, అయితే ప్రస్తుతం తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించకుండా పార్టీ కార్యక్రమాలకు దూరంగా పెడుతున్నందున తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన భవిష్యత్ కార్యచరణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి సత్యనారాయణ

మండల పరిధిలోని గ్రామ పంచాయితీలకు సంబంధించి 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి ప్రణాళికపై సమీక్షా సమావేశం జరిగింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం బృందం పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ ట్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇఒపిఆర్‌డి నక్కా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరప ఇఒపిఆర్‌డి బి.వి.సత్య నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి జిపిడిపి ఎంతో దోహద పడుతుందన్నారు. పంచాయితీల వారీగా రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి తుది నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సునీల్ కుమార్, ప్రసన్నాంజనేయులు, ఎడిపిఎం జి.స్వామి పాల్గొన్నారు.

పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా మెర్ల

ప్రజాశక్తి - కరప

కాకినాడ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా వేలంగి గ్రామానికి చెందిన మెర్ల భవాని శంకర్ ప్రసాద్ గురువారం కాకినాడలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు చూసి వాటిని న్యాయపరంగా అడ్డుకునేందుకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటులో చర్చించేందుకు చిత్త శుద్ధితో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఓటర్లు తమ అభ్యర్థనను మన్నించి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సిఎం పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సామర్లకోట

శుక్రవారం పెద్దాపురం నియోజకవర్గం మీదుగా జరుగుతున్న సిఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం రోడ్డు షో పెద్దాపురం ఎడిబి రోడ్డు మీదుగా కొనసాగి కాకినాడ అచ్చంపేట సెంటర్లో జరిగే సభకు హాజరవుతున్న క్రమంలో ఉదయం 10:30 గంటలకు సామర్లకోట పట్టణం లోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సెంటర్‌లో రోడ్డు షో ద్వారా విచ్చేస్తున్న ఘనంగా స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. అనంతరం రోడ్ షో కాకినాడ అచ్చంపేట సెంటర్‌కు వెళ్ళనున్నందున నియోజకవర్గ నాయ కులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నోటీసు

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S. No. 51/2023

Between:

మందపాటి శ్రీరామరాజు ...Plaintiff

మరియు

తుంగల సురేష్ ...Defendant

టు : ప్రతివాది :

తుంగల సురేష్, S/o. ఆంజనేయులు, వయస్సు 34 సం॥లు, వ్యాపారం, డో.నెం. 6-123, చిత్రాడ గ్రామం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా, పిఠాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధి

పై దావా వాది గారికి మీ వద్ద నుండి రావలసిన బాకీ నిమిత్తం దాఖలు చేసుకున్న మీకు శ్రీ కోర్టువారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు గల దావా **ది. 19-04-2024న** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి పై దావాలో మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై దావాలో మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీ చేయబడినది ||

పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్

పిఠాపురం. డో.నెం. 4-2-133, కుచివారి వీధి,
ది.18-4-2024 పిఠాపురం. సెల్: 9848006149

సిఎం బస్సు యాత్ర ట్రైల్ రన్

ప్రజాశక్తి - సామర్లకోట

సిఎం పర్యటనకు సంబంధించిన ట్రైల్ రన్ దృశ్యం

సిఎం జగన్మోహనరెడ్డి సిద్ధం బస్సు యాత్ర రోడ్ షో 19వ తేదీ శుక్రవారం పెద్దాపురం ఎడిబి రోడ్డు మీదుగా సాగనుంది. ఇందుకు సంబంధించి సిఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను గురువారం సాయంత్రం నిర్వహించారు. పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ట్రయల్ రన్‌ను పెద్దాపురం ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నుంచి అచ్చంపేట వంతెన మీదుగా ఉండూరు, కొప్పవరం గ్రామాల మీదుగా కాకినాడ అచ్చంపేట సెంటర్ వరకూ కొనసాగించారు. ఈ ట్రయల్ రన్‌లో జిల్లాస్థాయి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఆమోదం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో 1500 పైబడిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ రేషనలైజేషన్ కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందనీ, వాటికి ఎన్నికల కమిషన్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటికి అదనంగా ఎనిమిది చోట్ల ఎక్సులరీ పోలింగ్ కేంద్రాల గుర్తించడం, ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 5 కేంద్రాలు, రాజమహేంద్రవరం రూరల్‌లో మూడు కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం నుంచి పెనికేరు వెళ్లే దారిలో ఎస్ఇబి స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ఇటుక బట్టి వద్ద భారీగా గోవా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని ఎస్ఇబి ఎస్ఐ సత్యవేణి గురువారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం.. అడిషనల్ ఎస్‌పి ఖాదర్‌బాషాకు అందచేసిన సమాచారంతో ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఇబి సంయుక్త ఆధ్వర్యంలో చేసిన దాడిలో మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో మొత్తం 130 బాక్సుల్లో ఉన్న 6240 బాటిళ్ళ మద్యం పట్టుబడినట్లు చెప్పారు. ఈ మద్యం గోవాకు చెందినదిగా గుర్తించామని, దీని విలువ రూ.7.8 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ సత్యవేణి తెలిపారు.

మాట్లాడుతున్న తమన్నా సింహాద్రి

బిసివై పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు (పిఠాపురం)

మండలంలోని చేబ్రోలు గ్రామంలో భారత చైతన్య యువజన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి బిగ్ బాస్ ఫ్రేమ్ తమన్నా సింహాద్రి గురువారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ అన్ని కులాలను, మతాలను అందరిని కలుపుకుని ముందుకు సాగుతుందన్నారు. తనను నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారని నమ్మకంతో పోటీ చేస్తున్నానని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు మాత్రమే పోటీలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీను, కళ్యాణి, ఎం.శివ, ఎం.సుబ్బారావు, పి.రాజా పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు

H.M.O.P No. 122/2022

Between:

ఘనశాల నరసింహమూర్తి ...వాది

మరియు

ఘనశాల మహాలక్ష్మి ...ప్రతివాది

పై నెంబరు పిటిషన్లో ప్రతివాది అయిన ఘనశాల మహాలక్ష్మికి రిజిస్టర్ పోస్ట్ మరియు కోర్టు వారి ద్వారా సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు సబ్సిట్యూట్ సర్వీస్ ద్వారా **ది. 01-05-2024వ తేదీన వాయిదా అయి ఉన్నదని ఆరోజు ఉదయం 10:30 గంటలకు,** ఘనశాల మహాలక్ష్మి W/o. నరసింహమూర్తి, D/o. జల్లూరి వెంగయ్య, వయస్సు 35 సంవత్సరాలు, హిందూ, ఫిమేల్, R/o. తీరుగూడెం, నిడదవోలు మున్సిపాలిటీ, తూర్పుగోదావరి జిల్లా, అనువారు స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని శ్రీ కొవ్వూరు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు హాజరు కావలసి ఉన్నదని, అలా కాని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఎస్. కాశీ విశ్వేశ్వరరావు
న్యాయవాది, నిడదవోలు
సెల్: 8978554125

SUMMONS

మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 176/2021

Between:

సత్తి సూరారెడ్డి, తండ్రి: సత్తి పనసారెడ్డి, హిందువు, వయస్సు 51 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 4-19-56/64, శ్రీనగర్, మండపేట, తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు JCJ. **-వాది**

మరియు

నాగిడి కామేశ్వరమ్మ (died) మరియు ఇతరులు **-ప్రతివాదులు**

1. నాగిడి కామేశ్వరమ్మ, భర్త: లేటు కామేశ్వరరావు, వయస్సు 70 సం॥లు, ఇంటిపని, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ. (died)

2. పెమ్మాడ సత్యవేణి, భర్త: సత్యనారాయణ (తండ్రి: లేటు నాగిడి కామేశ్వరరావు), వయస్సు 52 సం॥లు, ఇంటిపని, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ.

3. నాగిడి సత్యనారాయణ, తండ్రి: లేటు కామేశ్వరరావు, వయస్సు 48 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ.

4. సరిపల్లి సత్య, భర్త: కృష్ణ (తండ్రి: లేటు నాగిడి కామేశ్వరరావు), వయస్సు 46 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ.

5. ధర్మాడి శ్రీలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు (తండ్రి: లేటు నాగిడి కామేశ్వరరావు), వయస్సు 44 సం॥లు, ఇంటిపని, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ.

6. పినపోతు శ్రీదేవి, భర్త: పల్లపురాజు, (తండ్రి: లేటు నాగిడి కామేశ్వరరావు), వయస్సు 42 సం॥లు, ఇంటిపని, డోర్ నెం. 78-16-1/1, రామాలయం సెంటర్, శ్యామల నగర్, కీర్తి డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ దగ్గర, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం Prl. JCJ.

పై నెంబరు దావా గ్రంథములో వాది మీలో 6వ ప్రతివాది మరియు 1 టు 5 ప్రతివాదుల పైన ప్రామిశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం పై కోర్టులో రూ. 5,16,000/-లకు దావా దాఖలు చేసినందున మరియు వాది, 6వ రెస్పాండెంట్/ ప్రతివాది మరియు 1 టు 5 రెస్పాండెంట్స్/ ప్రతివాదులపైన I.A. No. 297/2021 రులో మీ యొక్క ఆస్తిని తోడజప్తు చేయమని పిటిషను దాఖలు చేసియున్నారు.

సదరు పై దావా గ్రంథములోను మరియు పై I.A. నెంబరులోను శ్రీ కోర్టు వారు 6వ ప్రతివాది అయిన మీకు పలుమార్లు సమన్లు మరియు నోటీసులు పంపించినప్పటికీ మీరు వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించినందున, మీకు యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై దావా గ్రంథములోను మరియు I.A. నెంబరులోను మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **ది. 06-05-2024వ తేదీన** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ వాదనను తెలియపరచుకోవలెను. లేని ఎడల పై కోర్టు వారు మీకు పరోక్షముగా నిర్ధారించబడునని మీకు తెలియపరచడమైనది.

వి.ఎస్.ఎస్.చౌదరి
అడ్వకేట్ & నోటరీ
మండపేట మండపేట-533308
తేది: 16-04-2024 సెల్: 9849582160

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్

మండలంలో పలు గ్రామాలకు చెందిన వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ వెంకటనారాయణ గురువారం తెలిపారు. రమణక్కపేట 20, ఎండపల్లి 24, నాగులపల్లి 13, ఇసుకపల్లి 12, మూలపేట 4, అమీనాబాద్ 16, ఉప్పాడ 38, మొత్తంగా 127 మంది వాలంటీర్స్ రాజీనామా పత్రాలను ఇచ్చారని తెలిపారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలోని ఇంద్రపాలెం గ్రామానికి చెందిన 50 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించిన రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు అందచేశారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఏపీఐసీ కాలనీలో వినాయక కేఫ్ సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు భోజన ప్యాకెట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు భోజన ప్యాకెట్లు సమకూరుస్తున్న వినాయక కేఫ్ యజమాని మాధవరావు సేవా తత్పరత అభినందినీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

దాట్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి, జార్జిపేట గ్రామాల్లో టిడిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం తొలుత నీలపల్లి గ్రామంలో నీలపల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మే 13న జరిగే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొరబాబు సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొరబాబు కుమార్తె సార్విక, అయ్యరక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల లక్ష్మిరాజేశ్వరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, ఆకుల కృష్ణబాపూజీ పాల్గొన్నారు.

2వ డివిజన్‌లో పిల్లి దంపతులు ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 2వ డివిజన్లో జనసేన పార్టీ అభ్యర్థులు విజయం కోరుతూ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీతో కలిసి వారు ప్రచారాన్ని చేపట్టారు. శుక్రవారం పంతం నానాజీ నామినేషన్ దాఖలు చేస్తారని, కావున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వలసపాకల గ్రామంలో పెరికల గౌతమ్ సారథ్యంలో పలువురు టిడిపిలో చేరారు. వీరికి వారు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ల తొలిరోజు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలు షెడ్యూల్ వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు. నామినేషన్ పత్రాలు ఆర్‌డిఒ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. 25 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అందిన నామినేషన్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో పారా మిలిటరీ దళాలను నియమించడంతోపాటు మొత్తం ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాక్ సిరామిక్ పరి శ్రమలో కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకట రమణ డిమాండ్ చేశారు. గురువారం విధులను నిలుపు దల చేసిన కార్మికులతో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యా లయం వద్ద ధర్నా చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని విధులను నిలుపుదల చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలాగా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎన్.బుల్లిరాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికుల పనులను నిలుపుదల చేయడం దారుణమని అన్నారు. పర్మినెంట్ కార్మికులను అర్ధంతరంగా యాజమాన్యం గేటు వద్ద సెక్యూరిటీతో నిలుపుదల చేసి పనిలోకి రావద్దని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఒంటిలో శక్తి ఉన్నంతకాలం కార్మికులతో పని చేయించుకుని పరిశ్రమ లాభాలు

లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గడించి వయసు మీరుతున్న సమయంలో వారిని అన్యాయంగా తొలగించడం దారుణమన్నారు. తక్షణమే నిలుపుదల చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకుని సమస్యను పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల వెంకట మల్లికార్జున, కుక్కల చంద్రన్న, కాళ్ళ మంగారావు, గుబ్బర్తి క్రాంతికుమార్, వాడపర్తి సతీష్‌కుమార్, వల్లూరి వీరవెంకటసుబ్బారావు, జగ్గు మహంతి వీరవెంకటసత్యనారాయణ, బిల్లా ప్రభుదాస్ పాల్గొన్నారు.

దేశంలో 36 శాతం నిరుద్యోగం

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలోని గ్రాడ్యుయేట్ యువతీ యువకుల్లో నిరుద్యోగం 19.2 నుంచి 35.8శాతానికి పెరగడం ఆందోళన కరమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉద్యోగ అవకాశాలున్న రంగాల్లోనూ ఉపాధి కరువు పెరగడంతో నిరుద్యోగులు విదేశాలకు వలస పోతున్నారని అన్నారు. ప్రతిభ కలిగినప్పటికీ 90 శాతం మంది అసంఘటిత రంగంలో చిన్నా చితకా ఉద్యోగాలకు పరిమితం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కంపెనీలను ఫణంగా పెట్టి వక్రీకరించబడిన వృద్ధిరేటుతో ఎదుగుతున్న పెద్ద కంపెనీల కారణంగా నిరుద్యోగం ఎదుగుతున్న దుస్థితికి కారణమ వుతోందన్నారు. ప్రతిష్టాత్మక ఐటి లో గ్రాడ్యుయేట్ చేసిన 36 శాతం మందికి ఉద్యోగాలు కరువవ్వడం దయనీయమన్నారు. గత ఏడాది 32.8 శాతం మందికి ప్లేస్‌మెంట్ రానేలేదన్నారు. అవకాశాల కల్పనలో ప్రజాస్వామ్య ఫలాలను అందిపుచ్చుకోవడంలో పాలకుల తీరు తెన్నులే కారణమన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న శిరీష్

సాంస్కృతిక వారసత్వం యొక్క వైవిధ్యం, ప్రాముఖ్యతను భవితరాలకు అందించడం కోసం వాటిని పరిరక్షించుకోవాలని ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష అన్నారు. గురువారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పురాతన స్మారక చిహ్నాలు, భవనాలు మనకు ఒక ఆస్తి వంటివని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం కారణంగా చారిత్రాత్మక, కళాత్మక కట్టడాలు జీవం కోల్పోతున్నాయని అన్నారు. మన కాకినాడ నగరంలోనే శత వసంతాల పైగా దాటిన ఆంధ్ర సాహిత్య కళా పరిషత్, పిఠాపురం రాజా హయాంలో నిర్మించిన పి ఆర్ ప్రభుత్వ కళాశాల వంటివి ఎన్నో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రాజా పాల్గొన్నారు.

పవన్ గెలుపు ఖాయం : పృథ్వీరాజ్

ప్రజాశక్తి - పిఠాపురం

రాబోయే ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని సినీ హాస్య నటుడు పథ్వీరాజ్ అన్నారు. గురువారం ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రం పాద గయను, శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంను దర్శించుకున్నారు. అనంతరం కుమారపురంలో గోకుల్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపిలో నేటికి కొనసాగినట్లయితే

సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

తాను అపకీర్తిని మూటగట్టుకునే వాడినని అన్నారు. ఆ పార్టీ నుంచి వచ్చి మంచి పని చేశానని లేకపోతే కనీసం కుటుంబ సభ్యులు కూడా దరికి రానిచ్చేవారు కాదన్నారు. మార్పు తప్పనిసరిగా కావాలని దాని కోసం పవన్ కృషి చేస్తున్నారని అన్నారు. ముద్రగడ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. జగన్ ప్రభుత్వంలో అవినీతి తారాస్థాయిలో జరిగిందని, ఆ అవినీతి బయ టకు రావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. పిఠాపురం ప్రజలు పవన్ కల్యాణ్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. పవన్ కల్యాణ్ విజయం కోసం ప్రచారం చేసేందుకు ఇక్కడే ఉంటానని తెలిపారు. ఈ సమా వేశంలో జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, వెన్నపు చక్రధరరావు, సురవరపు సురేష్, తోలేటి శిరీష, మార్నిడి రంగాబాబు పాల్గొన్నారు.

మీడియా సమాచార కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ

సార్వత్రిక ఎన్నికలు ప్రక్రియలో భాగంగా గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు మీడియా సర్టిఫికెట్ నిమిత్తం మీడియా సర్టిఫికేషన్, మోనటరింగ్ కమిటి (ఎంసీఎంసీ) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా ముందుగా ఎంసిఎంసి కేంద్రంలో వివిధ ప్రచారాలకు అవసరమైన ప్రకటనలకు దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత వ్యవధిలో అనుమతులను జారీ చేస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ప్రతి ప్రకటనకు ముందస్తు ఎంసిఎంసి అనుమతి తప్పనిసరన్నారు. అభ్యర్థి ప్రచారం చేసుకునేటప్పుడు కమిటీ ద్వారా అనుమతులు విధిగా తీసుకోవాలన్నారు. వివిధ మాధ్యమాలలో వచ్చే ప్రకటనలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని ఆయన తెలిపారు. ప్రచారమాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు అనుమతులు పరిశీలించి అనుమతులు లేనట్లయితే సంబంధిత అభ్యర్థులకు ఆర్‌ఒల ద్వారా నోటీసులు జారీ చేయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిం చడంలో మీడియా పాత్ర కీలకమని తెలిపారు. ఇసిఐ మార్గదర్శకాలకు అనుగుణంగా మీడియా సహకారంతో విజయవంతంగా ఎన్నికలు నిర్వ హించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మే 13న పోలింగ్ ముందు, పోలీలగ్ రోజున, పోలింగ్ తర్వాత దశలకు సంబంధించి ఎన్నికల సమాచారాన్ని, స్వీప్ కార్యక్రమాల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తానున్నారు. ఈ నెల

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నివాస్

18వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లు మీడియా బుల్లెటిన్ జారీ చేస్తామన్నారు.. మే 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియలో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించు కావాల న్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, ఎంసిఎంసి సభ్యులు కుడా విసి పి.కృష్ణమూర్తి, జెఎన్‌టియుకె ప్రొఫెసర్ జెవిఆర్.మూర్తి, ఎస్.శివ నారాయణరెడ్డి, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంసిఎంసి కన్వీనర్ డి.నాగార్జున పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

సాధారణ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ వరకు సెలవు రోజులు మినహా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రతీరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 26వ తేదీన ఉదయం 11గంటలకు స్క్రూటినీ జరుగుతుందన్నారు. నామినేషన్ ఉపసంహరించుకునేవారు 29 తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోపు కార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేయాలని సూచించారు.

విజయవంతమైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చారిత్రాత్మక మొదటి కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసినట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసమూర్తి, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టలతోపాటు చెన్నైకి చెందిన ప్రముఖ వైద్య నిపుణుల బృందం నేతృత్వంలో విజయవంతంగా ఈ ఆపరేషన్ పూర్తి చేసినట్లు చక్రవర్తి తెలిపారు. అనస్థీషియాలజీ అండ్ క్రిటికల్ కేర్ బృందం, ఓటీ సిబ్బంది మరియు ఐసియూ సిబ్బంది జాగురుకతతో ఈ ఆపరేషన్ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ అవ

ఆపరేషన్ అనంతరం బృందంతో కళ్యాణ్ చక్రవర్తి

యవ దాత వారి కుటుంబ సభ్యులు, ట్రాన్స్ప్లాంట్ కోఆర్డినేటర్ స్వాతి, నర్సింగ్ సూపరింటెండెంట్ మహాలక్ష్మిలకు అభినందనలు తెలిపారు. ఈ విజయం మా ఆసుపత్రి సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాకుండా మా హాస్పిటల్ వైద్య సంరక్షణ కోసం కొత్త పుంతలు తొక్కడానికి మార్గం సుగమం అయిందని హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ గణేష్ ఆదిమూలం యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్‌గా, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ కిషోర్‌కుమార్ మరియు బృందంతో కలిసి ఈ బృహత్తరమైన ఆపరేషన్ విజయంలో పాలు పంచుకున్నారని చక్రవర్తి తెలిపారు. డాక్టర్ సోమయాజులు నెఫ్రాలజిస్ట్ శస్త్రచికిత్సకు ముందు తగిన సూచనలు చేశారని తెలిపారు.

ఇసి మార్గదర్శకాలను పాటించాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

సాధారణ ఎన్నికలు- 2024 కు సంబంధించి ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోన మీడియా సర్టిఫికేషన్ సమన్వయ కేంద్రం నందు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాధారణ ఎన్నికలు- 2024 కు సంబంధించి పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలకు గాను గత నెల 16 వ తేదీన విడుద లైన నోటిఫికేషన్ నేపథ్యంలో ఈ నెల 18 నుండి నామినేషన్ పత్రాలు స్వీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లా కేంద్రంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ పత్రాలు స్థానిక కలెక్టరేట్ నందు స్వీకరిస్తారన్నారు. అదేవి ధంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నిం గ్ అధికారుల కార్యాలయాలలో నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ స్వీకరణ సంబంధించి ఇప్పటికే భారత ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించిందని ఆ ప్రకారం నామినేషన్ స్వీకరిస్తామన్నారు. ఈనెల 26న నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ ఉంటుందన్నారు. ఈనెల 29న వరకు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని తదుపరి అదే రోజు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. మే 13 వ తేదీ పోలింగ్ ప్రక్రియ జిల్లా వ్యా ప్తంగా నిర్వహిస్తారన్నారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు కాట్రేనికోన మండలం చేయ్యేరు గ్రామ పరిధిలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తా మన్నారు. జూన్ ఆరో తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుం దన్నారు అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో సహాయ రిటర్నింగ్ అధి కారులుగా సంబంధిత తహశీల్దార్లు వ్యవహరిస్తారన్నారు. అమలాపురం పార్లమెంటు స్థానానికి జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, రామ చంద్రపురం అసెంబ్లీకి ఆర్‌డిఒ ఎస్.సుధాసాగర్, ముమ్మిడివరం అసెంబ్లీకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్మోహన్‌రావు, అమలాపురం అసెంబ్లీకి ఆర్‌డిఒ జి.కేశవర్ధన రెడ్డి, రాజోలు అసెంబ్లీకి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్, పి.గన్నవరం అసెంబ్లీకి జెడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామచంద్ర మూర్తి, కొత్తపేట అసెంబ్లీకి ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ, మండపేట అసెంబ్లీకి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ డివిఎస్.ఎల్లారావు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి మూడు వాహనా లతో నిర్దేశిత సభ్యులతో మాత్రమే రావాల్సి ఉంటుందన్నారు. ప్రసార మాధ్యమా లలో రాజకీయ ప్రకటన సంబంధించి మీడియా సర్టిఫికేషన్ కమిటీ అనుమతులు ముందస్తుగా పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాకు ముగ్గురు వ్యయ పరిశీలకులు వచ్చారని, వీరిలో ఒకరు పార్లమెంట్ స్థానానికి మిగిలిన ఇద్ద రూ ఏడు అసెంబ్లీల అభ్యర్థుల ప్రచార ఖర్చులను పర్యవేక్షిస్తారన్నా రు. వెబ్ కాస్టింగ్ సిసి కెమెరాల చిత్రీకరణ ఆధారంగా నిర్దేశిత రేట్ల ప్రకారం అభ్యర్థులు ప్రచార ఖర్చు లను గణిస్తారన్నారు. షాడో రిజిస్టర్లను నిర్వహిస్తారని తెలిపారు .సహాయ వ్యయ పరిశీలకులు మూడు రోజులకు ఒకసారి నివేదికలను సమర్పిస్తారన్నారు. నామి నేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నది లేనిది ముందుగా ధ్రువీకరించేందు కు ఆయా రిటర్నింగ్ అధికా రుల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ను డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారి తో ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల ప్రచార ఖర్చు పార్లమెంటుకు రూ.95లక్షలు, అసెంబ్లీకి రూ.40 లక్షలు గా నిర్ధారించారని ఈ పరిధిని మించి ఖర్చు చేసిన ఎడల ఆయా అభ్య ర్థులు పోటీల్లో గెలుపొందినప్పటికీ సభ్యత్వం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా సద్విని యోగం చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, డిఆర్ఒ ఎంవెంకటేశ్వర్లు, కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్ శర్మ, డిఐపిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, ఎంసి ఎంసి సభ్యులు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

విలేకరులను అడ్డుకున్న సిఐ దొరరాజు ఇతర పోలీస్ సిబ్బంది

నామినేషన్ల ప్రక్రియకు మీడియాకు అనుమతివ్వని పోలీసులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రికల ఎన్నికల్లో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ ల ప్రక్రియకు వెళ్లిన పాత్రికేయులను పోలీసులు అనుమతించలేదు. విలేకరులను లోపలికి వెళ్లేందుకు అనుమతులు లేవంటూ 50 మీటర్ల ముందే పోలీసులు నిలిపివేశారు. దీంతో విలేకరుల అసహనం వ్యక్తం చేశారు. అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న సిఐ పీతల దొరరాజు విలేకరుల లోనికి వెళ్లేందుకు ఆర్‌డిఒ అనుమతించలేదని ఎవరూ వెళ్లడం కుదరదు అంటూ ఎండలో నే నిలబెట్టారు. పోలీసుల అత్యుత్సాహంతో చేసేదేమీ లేక పలువురు విలేకరులు అసహనం వ్యక్తం చేసి అక్కడ నుంచి వెనుదిరిగారు. దీనిపై ఆర్‌డిఒ కార్యాలయంలో వివరణ కోరగా వారు సరైన సమాధానం చెప్పలేదు. ముందుగానే విలేకరులకు అనుమతులు లేవని ఎవరూ రావద్దు అని ప్రకటన ఇస్తే కవరే జికి వెళ్లకుండా ఆగిపోయే వాళ్ళమని విలేకరులు వ్యాఖ్యా నించారు.

వెంకన్న కళ్యాణోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు గురు వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే స్వామి వారికి వేద పండితులు మరియు అర్చకులు మేలుకొలుపు, నిత్యార్చన తదితర కార్యక్రమాల అనంతరం ధర్మనాలు ప్రారంభి ంచారు. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకు రార్పణ, వాస్తుపూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ, తదితరు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయమంతా యాత్రికులతో కిక్కిరిసిపోయింది. ఆలయాన్ని పుష్పాలతో సుం దరంగా అలంకరించారు యాత్రికులకు ఇబ్బంది తలెత్త కుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు డిసి భూపతి రాజు కిషో ర్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్వామివారి తీర్థం, మధ్యా హ్నం రథోత్సవం రాత్రి 8 గంటలకు కళ్యాణం నిర్వహించనున్నారు.

పూలతో అలంకరించిన ధ్వజస్తంభం

జగన్ యాత్రతో ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-ఆలమూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం చేపట్టిన బస్సు యాత్రతో 216ఎ జాతీయ రహదారిపై ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. ఇది జాతీయ రహదారిపై జొన్నాడ ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి రావులపాలెం వరకు, ఆర్అండ్‌బి రహదారిపై జొన్నాడ సెంటర్ నుంచి ఆలమూరు వరకు మొత్తం సుమారు నాలుగు కిలోమీటర్ల మేర గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. దీంతో వివిధ వాహనాలపై వెళుతున్న ప్రయాణికులు మండుటెండలో, వేసవి తాపానికి నానావస్థలు పడ్డారు. అలాగే ఈ సమయంలో కనీసం గుక్కెడు మంచినీళ్లు అందించే నాథుడు కరువయ్యారు. జొన్నాడ నుంచి మడికి వరకు జాతీయ రహదారిపై 9 కిలోమీటర్ల మేర జగన్ బస్సులోంచి వివిధ గ్రామాల దగ్గర ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ యాత్ర కొనసాగిస్తూ పొట్టిలంక వద్ద కడియం మండలం లోనికి ప్రవేశించారు.

జొన్నాడ పరిధిలో నిలిచిపోయిన ట్రాఫిక్

బాధితులతో మాట్లాడుతున్న జగన్

బాధితుడిని పరామర్శించిన జగన్

మండలంలోని మడికికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై బస్సు యాత్రలో ఉన్న జగన్ దగ్గరకు అంబులెన్స్లో పేషెంట్ ను తీసుకెళ్లారు. దీంతో ఎంఎల్ఎ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డితో కలిసి బస్సు దిగి వెళ్లి బాధితులను పరామర్శించి, వివరాలు అడిగి జగన్ తెలుసుకున్నారు. మరింత సాయం కావాలని బాధిత కుటుంబ సభ్యులు జగన్‌ను కోరారు. అవసరమైన సహాయం తప్పక అందిస్తానని భరోసా కల్పించారు.

నూకాంబిక హుండీల ఆదాయం రూ.14.78 లక్షలు

ప్రజాశక్తి-ఆలమూరు

చింతలూరు నూకాంబికా అమ్మవారి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించారు. 29 రోజులకు గాను రూ.14,78,881 వచ్చినట్లు ఇఒ ఎమ్ఎస్ఆర్.కృష్ణ తెలిపారు. ఈ లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీ అధికారి బాలాజీ రాంప్రసాద్ సమక్షంలోను, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధికారుల పర్యవేక్షణ, గ్రామస్తుల సహకారంతో నిర్వహించినట్లు ఇఒ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, అటెండర్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీల లెక్కింపు

పట్టణంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో టిడ్కో గృహాల నందు 'బాబు ష్యూరిటీ...భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు మరియు టిడిపి శ్రేణులతో కలిసి ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటికీ పర్యటించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురంరూరల్

కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్కో రామచంద్రపురం డిఇ వై.విజయ్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సబ్ స్టేషన్లలో వార్షిక మరమతుల కారణంగా మండలంలోని వెదురుమూడి, కపిలేశ్వరపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, వల్లూరు, నేలటూరు, నల్లూరు, టేకి, అచ్యుతాపురం, కాలేరు, గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని దీనికి గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు, రేపు మూడు గ్రామాలకు ..

మామిడికుదురు నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మూడు గ్రామాలకు శుక్రవారం, శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఎఇ ఇ రవికుమార్ గురువారం తెలిపారు పెదపట్నం లంక, బి దొడ్డవరం, పాశర్లపూడి బాడవ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేస్తామన్నారు జాతీయ రహదారుల విభాగంలో చెట్లు తొలగింపు నిర్వహణ లో భాగంగా సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.



ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ

ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం గ్రామ ఆర్య వైశ్య సంఘం నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం స్థానిక కోదండ రామాలయం నందు ఘనంగా జరిగింది. మండపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, ఆర్య వైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు అయిన కాళ్ల కూరి నాగబాబు చేతులమీదుగా జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన పాలక వర్గాన్ని సత్కరించారు. ముందుగా అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలకు వివిధ రకాలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బోడా వీర్రాజు, మిర్తిపాటి గంగారామ్, ఆర్య వైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.కమల కుమారి అధ్యక్షతన గురువారం సమగ్ర శిక్ష సహిత విద్య కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సు కు జిల్లా సమగ్ర శిక్ష అదనపు సంచాలకుడు మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లాలోని సిడిపిఒ లు,అంగన్ వాడి సూపర్ వైజర్ లనుద్దేశించి మాట్లాడారు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప అవకాశం అని, వీటిని సమగ్రంగా అమలు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావచ్చునన్నారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ సహిత విద్యా విభాగం అందించే సేవలను, పిల్లలకు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో సిఎంఒ బి. సుబ్రహ్మణ్యం, ఎఎంఒ పి.రాంబాబు, ఎఫ్ఎఒ జి.ప్రవీణ్, ఎపిఒ ఎం.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి బాబ్జీకి పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

సతీ వియోగంతో బాధపడుతున్న మండపేట మాజీ ఎంపిపి అడబాల బాబ్జి ని గురువారం స్థానిక శాసన సభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మండలం లోని ద్వారపూడి బాబ్జి స్వగృహానికి వెళ్లిన వేగుళ్ల అడబాల బాబ్జి సతీమణి రామలక్ష్మీ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

సిఎం జగన్ రోడ్ షోకు విశేష స్పందన

ప్రజాశక్తి-కడియం

కడియం మండలంలో గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రోడ్ షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రావులపాలెం నించి తూర్పు గోదావరి జిల్లాకు చేరుకున్న జగన్ బస్ యాత్ర తొలుత మండలంలోని పొట్టిలంకకు చేరుకుంది. అక్కడ సెంటర్‌లో గ్రామస్తులు అధిక సంఖ్యలో స్వాగతం పలికారు. అనంతరం కడియపులంక లోని హైవే చెంతన ఉన్న ఈలి అరుణకుమార్‌కు చెందిన నర్సరీ భూమిలో భోజన విరామం ఏర్పాటు చేశారు. అనంతరం నాలుగు గంటలకు కడియపులంక పూలమార్కెట్ సెంటర్‌కు జగన్ బస్ యాత్ర చేరుకుంది. అక్కడ వేలాదిమంది వైసిపి శ్రేణులు, అభిమానులు పూలను చల్లుతూ స్వాగతం పలికారు. సిఎం వైఎస్.జగన్ బస్ పైకి చేరుకుని అందరికీ అభివాదం చేశారు. పది నిముషాలకు పైగా బస్ పైన అటూ ఇటూ తిరుగుతూ అభిమానులను ఉత్సాహ పరించారు. వేమగిరిలోని హైవే సెంటర్‌లో వేలాదిమంది పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు స్వాగతం పలికారు. సిఎం జగన్ వెంట బస్‌లో వైసిపి రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం అభ్యర్థి జక్కంపూడి రాజా, బ్యూటిఫికేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల కన్వీనర్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, పలువురు నాయకులు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై గిరజాల బాబు

సిఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు స్థానిక రైతులతో కలిసి ఎడ్ల బండిపై కడియం నుండి వేమగిరి వెళ్లారు.

సిఎం పర్యటనలో ఆకర్షణగా చిన్నారి

రాజమహేంద్రవరం రూరల్ : సిఎం వైఎస్.జగన్ బస్సు యాత్ర గురువారం రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వరకూ సాగింది. ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ సమీపంలో చిన్నారి లాస్య వైసిపి జెండా, సిఎం జగన్ చిత్రం ఉన్న టి.షర్టును ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అభివాదం చేస్తున్న సిఎం వైఎస్.జగన్

రూ.50 వేలకు మించి నగదు రవాణా చేయవద్దు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎన్నికల కోడ్ అమలవుతున్న కారణంగా ప్రజలు తమతో రూ.50 వేలకు మించి నగదు రూపేణా ఉంచుకోవద్దని ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు ప్రజలకు సూచించారు. కోడ్ కారణంగా జిల్లా చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.50 వేలకు మించి ఉంటే ఆ నగదుకు సరైన పత్రాలు, బిల్లులు, ఆధారాలు అధికారులకు చూపాలన్నారు. సరైన పత్రాలు, వివరాలు లేని నగదును ప్రభుత్వం స్వాధీన పరుచుకుంటుందన్నారు. బుధవారం వరకు మండలంలో సుమారు రూ.12 లక్షల నగదు స్వాధీనపరచుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-చాగల్లు

ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన రూ.340 ఏమాత్రం గిట్టుబాటు కాదని ప్రస్తుతం రైతుకు రూ.910 ఖర్చు అవుతోందని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, మండల అధ్యక్షుడు కంకటాల బుద్ధుడు అన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం 0-8 కిలోమీటర్ వరకు ఒక టన్నుకు రూ.రెండు వేల చొప్పున హమాలీ ఖర్చు ఒక టన్నుకు రూ.86.25 పైసల చొప్పున మొత్తం రూ.346 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ రైతుకు మొత్తం రూ.910 ఖర్చు అవుతుందని తెలిపారు వారు తెలిపారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కామ రకం 100 కేజీలు రూ.2,683 చొప్పున పెంచాలని, ఎ గ్రేడ్ 100 కేజీలు రూ.2,803 పెంచాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం గిట్టుబాటు కల్పించాలని రైతును ఆదుకోవాలని కోరారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-రాజానగరం

సార్వత్రిక ఎన్నికలు 2024 నోటిఫికేషన్ గురువారం విడుదలైందని రాజానగరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశామని చెప్పారు. నామినేషన్లు దాఖలకు ఈ నెల 25వ తేదీన వరకు గడువు ఉందన్నారు. వీటిని పరిశీలన 26వ తేదీన, ఉపసంహరణ 29వ తేదీన ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 100 మీటర్ల లోపు మూడు వాహనాలు, అభ్యర్థి తోపాటు ఐదుగురు వ్యక్తులకు మాత్రం అనుమతి ఉందన్నారు. పూర్తి వివరాలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

సిఎం జగన్ సభకు సిద్ధమైన ఏర్పాట్లు

సిఎం జగన్ సిద్ధం సభకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సిఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర నేడు కాకినాడకు చేరుకొనుంది. ఉదయం బయలుదేరిన ఆయన సామర్లకోట మండలం ఉండూరు వద్ద ఏర్పాటుచేసిన వసతి శిబిరంలో భోజన విరామం తీసుకోనున్నారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం అచ్చంపేట జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మేము సిద్ధం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించి బహిరంగ సభ ఏర్పాట్లు నాయకత్వం తలామునకలైంది. సభ అనంతరం పిఠాపురం మీదుగా సిఎం జగన్ రోడ్ షో నిర్వహించనున్నారు. సిఎం జగన్‌పై రాయి దాడి తర్వాత పోలీసులు మరింత భద్రతను ఏర్పాటు చేశారు. రోడ్డుషో సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎన్నికల పరిశీలన కార్యాచరణపై సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకులకు అనుసంధానం చేసిన లైజాన్ అధికారులు, ఇతర అనుబంధ సిబ్బందితో గురువారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత డిఆర్‌ఒ జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కష్ణ నాయక్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా తమిళనాడుకు చెందిన కె.బాలసుబ్రమణ్యం, అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన కమల్ కాంత్ సరోచ్, తమిళనాడుకు జైఅరవింద్, పార్లమెంట్ వ్యయ పరిశీలకులుగా, ఏడు అసెంబ్లీ వియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా నితిన్ కురైన్, గుజరాత్‌కు చెందిన బలరామ్ మీనాను పోలీస్ అబ్జర్వర్‌గా కేంద్ర ఎలక్షన్ కమిషన్ నియమించినట్లు తెలిపారు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా కె.బాల సుబ్రమణ్యం అనపర్తి, రాజానగరం, రాజమండ్రి అర్బన్, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాలకు, కమల్ కాంత్ సరోచ్ కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. పరిశీలకులకు అనుసంధానం చేసిన లైజనింగ్ అధికారులు, అనుబంధ సిబ్బందిని నియమించామని, ఎప్పటికప్పుడు వారితో సమన్వయం, సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సంప్రదించి అందించాలన్నారు.

కె.సావరంలో ఒఆర్‌ఎస్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ఒఆర్‌ఎస్ ద్రావణం తరచూ తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్‌విఎస్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కె.సావరం టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఒఆర్‌ఎస్ కాంపెయిన్‌లో ఆయన గ్రామ ప్రజలకు ఎండాకాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒఆర్‌ఎస్ ద్రావణం తయారీ విధానం వివరించారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు హెల్త్ సెంటర్లలో, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తల వద్ద, ఆసుపత్రుల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. ఒక పాకెట్ పౌడర్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి, కొద్దిగా, కొద్దిగా తరచూ సేవించాలన్నారు. ఒకసారి కలిపిన ద్రావణాన్ని మరుసటి రోజుకు నిల్వ ఉంచకుండా ఆ రోజే వినియోగించాలన్నారు. చిటికెడు ఉప్పు, చారెడు పంచదార, ఒక లీటర్ నీటిలో కలిపి దానిని ఒఆర్‌ఎస్ ద్రావణంగా తీసుకోవచ్చన్నారు. రానున్న మే నెలలో ఎక్కువగా వడగాలులు వీస్తాయని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ, ఉదయం 11 గంటల లోపే తమ పనులన్నీ ముగించుకుని, నీడ ప్రదేశాలు, లేదా ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల తరువాత మాత్రమే బయటకు రావాలని, తెల్లని వస్త్రాలు, లేదా లేత రంగుల వస్త్రాలు ధరిస్తే ఎండ వేడిమి నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.సంధ్యాలక్ష్మి, ఎఎన్ఎం రత్న కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కె.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ అంబటి విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రూరల్‌లో తొలిరోజు నామినేషన్లు నిల్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి రోజున ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ వరకూ ప్రతి రోజూ (ఏప్రియల్ 21 ఆదివారం మినహా) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ మాత్రమే నామినేషన్లు అనపర్తి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం

శుక్ర వారం ఉదయం 08.00 గంటల నుంచి 10 గంటల వరకూ వార్షిక విద్యుత్ మరమ్మతుల నిమిత్తం వేమగిరి విద్యుత్ సబ్-స్టేషన్‌లోని వేమగిరి ఇండస్ట్రియల్ ఫీడర్, వేమగిరి అగ్రికల్చరల్ ఫీడర్‌లకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని ఇఇ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మండలంలోని వేమగిరి, వేమగిరి ఇండస్ట్రియల్, అగ్రికల్చరల్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

అవయవదానంతో ఐదుగురికి ప్రాణం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దకు తీవ్ర గాయాలవగా.. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యులు ఆ బాధను దిగమింగుకుని అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆయన నుంచి సేకరించిన అవయవాలతో ఐదుగురి జీవితాలను కాపాడారు. కాకినాడ అర్బన్ మిలిటర్ రోడ్ కనకమహాలక్ష్మి వీధికి చెందిన కొండేపూడి పుబ్రహ్మణ్యం (49) కూలి పని చేసుకొని జీవనం సాగించేవారు. ఈ నెల 12న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న డివైడర్ మీద పడిపోవడంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. వెనువెంటనే స్థానికులు సంబంధిత బంధువులకు సమాచారం అందించారు. అక్కడి నుంచి ఆయనను న్యూరోస్టార్ హాస్పిటల్‌లో చేర్చగా డాక్టర్లు పరీక్షించి మెదడులో రక్తం గడ్డ కట్టిందని (బ్రెయిన్ డెడ్) కోలుకొనే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. దీంతో అంతటి దుంఖంలోనూ ఆయన భార్య సాయి సుధ, కుటుంబసభ్యులు అవయవదానం చేస్తే కనీసం ఆయన ఇతర జీవితాలలో బతికి ఉంటారని భావించారు. అక్కడ నుండి వారి కుటులు సభ్యుల అనుమతితో ఆయనను అవయవదానం కోసం కాకినాడ సర్పవరం ట్రస్ట్ హాస్పిటల్‌కు తరలించారు. రెండు కిడ్నీలు, ఒక లివర్, రెండు కళ్లు జీవన్ దాన్ వారికి దానం చేసారు. వీటిని ట్రస్ట్ హాస్పటల్లో చికిత్స తీసుకుంటున్న వారికి అమర్చగా మరో కిడ్నీని వైజాగ్ కేర్ హాస్పిటల్‌కు తరలించారు. కొండేపూడి సుబ్రహ్మణ్యం భార్య సాయిసుధ అభినందనీయురాలని పలువురు ప్రశంసించారు.

గ్యాస్ లీకై మంటలు : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గోపాలపురం

ఇంటిలో గ్యాస్ సిలిండర్ లీకైన సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని వాదాకుంట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వాదాలకుంట గ్రామానికి చెందిన నామాల నిర్మల వంట చేస్తుండగా గ్యాస్ బండకు ఉన్న పైపు- లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న తల్లిని కాపాడటానికి కుమార్తె కళ్యాణి, కుమారుడు కార్తీక్ ప్రయత్నించడంతో వారు కూడా మంటల్లో చిక్కుకుని గాయాల పాలయ్యారు. వీరు ముగ్గురినీ గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా తల్లి నిర్మల శరీరం 80 శాతం వరకూ కాలిపోవడంతో ఆమెను మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. తీవ్రగాయాలైన నిర్మల పక్షవాతంతో బాధ పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సిఎం యాత్ర నేపథ్యంలో చేస్తున్న మరమ్మతులు

సిఎం జగన్ రాకతో ఎడిబి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-రాజానగరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ జిల్లాలో బస్సు యాత్రలో భాగంగా గురువారం రాత్రి బస చేయడంతో ఎడిబి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఏళ్ల తరబడి గోతులతో ఉన్న రహదారిని పూడ్చారు. ముఖ్యమంత్రి జగన్ రాజానగరం సమీపంలోని కాకినాడ ఎడిబి రోడ్ సమీపంలో ఎస్‌టి.రాజాపురం ప్రైవేట్ లే అవుట్లో గురువారం రాత్రి బస చేస్తున్నారు. ఈ రహదారి సుమారు ఐదారేళ్ళ నుండి గోతులతో ఉంది. వాహనదారులు గోతుల్లో పడి తీవ్ర గాయాలయ్యాయి. ధుమ్మూ, ధూళీ గోతులతో ఉన్న ఈ రహదారిని ముఖ్యమంత్రి రాక సందర్భంగా హుటాహుటిన అధికారులు పూడ్చారు. ప్రత్యేకంగా తారు కంకరుతో గోతులను కప్పెట్టి రోలింగ్ చేశారు. ఏళ్ల తరబడి ప్రయాణికులు ప్రమాదాలకు గురైనా పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి రాకతోనైనా రోడ్ తాత్కాలిక మరమ్మతులు చేయడంపై వాహనదారులు పెదవి విరుస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదరించాలి

పి.గన్నవరం ఎంఎల్ఎ చిట్టిబాబు

ప్రజాశక్తి-అంబాజీపేట

పి.గన్నవరం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని నియోజవర్గ ప్రజలు అభిమానంతో గెలిపించి, ఆదరించాలని సిట్టింగ్ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు కోరారు. అంబాజీపేటలో ఎవిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో గురువారం జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ 2004 నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడునని 2004, 2009 లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. నేను చేసిన సేవలను వినియోగించుకొని వైసిపి తనకు తీరని అన్యాయం చేసిందని బహిరంగంగా విమర్శించారు. ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్రానికి సరైన రాజధాని, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సాధన కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ నాశనం చేసి రుణాంధ్రప్రదేశ్ గా మార్చిందని విమర్శించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొండేటి చిట్టిబాబు

దేశానికి దిశా నిర్దేశం కాంగ్రెస్ వల్ల సాధ్యమని యువత ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో దేశం మొత్తం బిజెపి పై తిరగబడుతుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎండి ఆరీఫ్ అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, మాచవరపు శ్రీమన్నారాయణ,బొంతు రాజేంద్రప్రసాద్, నియోజకవర్గం మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

జంపింగ్ జపాంగ్

పెద్దాపురం : మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు నేతృత్వంలో సూర్య బలిజ కమ్యూనిటీకి చెందిన పలువురు టిడిపిలో చేరారు. వీరికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలో ఆయన ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, నాయకులు తూతిక రాజు, కొరుపూరి రాజు, వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట : ప్రముఖ వ్యాపారవేత్త, బిసి నాయకులు వాడపర్తి వీరభద్రరావు ఆయన అనుచరులతో కలసి గురువారం టిడిపిలో చేరారు. ఆయన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పార్టీ కండువాలను కప్పి వారిని సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అ... శ్రీకాంత్, కంటే జగదీశ్, వల్లూరి దొర, యార్లగడ్డ జగదీశ్, బలుసు వాసు, గోలి వెంకట అప్పారావు చౌదరి, అందుగుల జార్జిచక్రవర్తి, పాల్గొన్నారు.

కాకినాడ : కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. గురువారం స్థానిక టిడిపి సిటీ నియోజకవర్గ అభ్యర్థి వనమాడి కొండబాబు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన మాజీ కౌన్సిలర్ వరిపిల్లి శివ, గత కార్పొరేషన్ ఎన్నికల్లో 17వ వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన అర్జిల్ల సత్యానందం, 10వ డివిజన్‌కి చెందిన తిరిది జగన్నాథం, 27వ డివిజన్‌కి చెందిన రాజానా అప్పారావు, వాలంటరీగా పనిచేసి రాజీనామా చేసిన కోడూరి నీలిమ టిడిపిలో చేరారు. వీరికి కొండబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, దూల్ల సూరిబాబు, కోడూరు పెద్ద, పాణి పాల్గొన్నారు.

ఐ.పోలవరం : మురమళ్ల టిడిపి క్యాంపు కార్యాలయంలో కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో 50మంది టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. జనసేన, టిడిపి నాయకులు మద్దింశెట్టి పురుషోత్తం, పెంటా రవి, సిహెచ్.ముని, చోడిశెట్టి బ్రహ్మానందం, కోళ్ల వీరభద్రం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల వెంకన్నబాబు,జి.జమ్మి,చిక్కాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి మాజీ ఎంఎల్ఎ తనయుడు

మామిడికుదురు : తేతలిలో నైట్ స్టే పాయింట్ వద్ద పి.గన్నవరం నియోజకవర్గం నుంచి మాజీ ఎంఎల్ఎ నీతిపూడి గణపతిరావు కుమారుడు గణేష్‌బాబు, మనువడు గణపతిరావు సిఎం.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వైసిపి పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంఎల్ఎ పాముల రాజశ్వరిదేవి ఆధ్వర్యంలో ఈ జగన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సామర్లకోట : సామర్లకోట పట్టణ పరిధిలోని బళ్ళమార్కెట్ సెంటర్ లోని 17వ వార్డుకి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వార్డు నాయకుడు సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాల శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉభా జాన్ మోజెష్, కౌన్సిలర్ నేతల హరిబాబు, జట్ల మోహన్ పాల్గొన్నారు.

అకౌంటింగ్‌పై అవగాహన అవసరం

-కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాద్దిక్ అహ్మద్

ప్రజాశక్తి - కాకినాడ

సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికలకు సంబంధించి బ్యాంకు ఖాతా నిర్వహణ, ఖర్చులు, వాటి వివరాలు నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించాలని కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాద్దిక్ అహ్మద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎకౌంటింగ్ సిబ్బంది, నోడల్ అధికారులు, ఇతర బృందాలతో జిల్లా వ్యయ పరిశీలకులు సాద్దిక్ అహ్మద్, యోగేష్ కుమార్, ఎ.ఆషీఫ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్‌తో కలిసి సమావేశం అయ్యారు. జిల్లాలో అకౌంటింగ్ బృందాలు, అదనపు వ్యయ పరిశీలకుల విధులు, వారికి అందించిన సామాగ్రి, ఇతర సదుపాయాలు, సి.విజిల్, సీజర్ మేనేజ్‌మెంట్ రిపోర్ట్ వివరాలు, ఎంసిఎంసి, ఎఫ్ఎస్టీ, వీడియో సర్వలెన్స్, వ్యయ బృందాలు, కంట్రోల్ రూమ్, మీడియాలో వచ్చే ప్రతికూల వార్తల వివరాలు, చెక్ పోస్ట్‌లో తనిఖీ, వెబ్ కాస్టింగ్, ఎక్సైజ్ వంటి అంశాలపై కలెక్టర్ నివాస్ వ్యయ పరిశీలకులకు వివరించారు.

పదేళ్లుగా ప్రజలఘోష

- కానరాని ఏలేరు ఆధునికీకరణ
- వరదల్లో సర్వం కోల్పోతున్న రైతులు
- ఏటా రూ.కోట్లలో నష్టపోతున్న అన్నదాతలు
- టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం

పాలకులు ఎవరైనా సరే ఏలేరు ఆయకట్టు రైతుల సమస్యలకు మాత్రం పరిష్కారం చూపట్లేదు. అటు టిడిపి, ఇటు వైసిపి సర్కారు హయాంలోనూ ఇదే పరిస్థితి. ఏటా కోట్లాది రూపాయాల పంటను నష్టపోతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఏలేరు ఆధునికీకరణ పాలకులకు ఎన్నికల హామీగానే మిగిలిపోతుంది తప్ప ఆచరణలో మాత్రం ముందుకు సాగట్లేదు. బడ్జెట్‌లో నిధులు మంజూరు చేస్తున్నట్టు చూపుతున్నా... విడుదల మాత్రం ఉండట్లేదు. టిడిపి, వైసిపి సర్కారు తీరు ఫలితంగా నేటికీ ఏలేరు ఆయకట్టు రైతులు ముంపు సమస్యతో ఏటా అప్పుల ఊబిలో మునిగిపోతూనే ఉన్నారు.

ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టు

2020లో వరదలకు పిఠాపురం మండలం గోకివాడ వద్ద ఏలేరు కాలువకు పండిన గండి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండల పరిధిలో 24 టిఎంసిల సామర్థ్యంతో ఏలేరు ప్రాజెక్టును నిర్మించారు. ఏలేరు ప్రాజెక్టు సాగు నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని దాదాపు 40 వేల మంది రైతులకు చెందిన సుమారు 54 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. ఏలేరు, గొర్రిఖండి, నక్కలఖండి, పెద్దేరు, చిప్పలేరు అనే పేర్లతో పిలిచే ఈ కాలువ ఐదు మండలాల పరిధిలో విస్తరించి, కొత్తపల్లి మండలంలో సముద్రం వరకూ ఉంది. సాగునీటి అవసరాలను తీర్చగా మిగిలిన నీటిని సముద్రంలో కలిసేలా ఏలేరు కాలువను అప్పట్లో ప్రణాళికాబద్ధంగా రూపొందించారు. జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం మండలాల్లో తాగునీటి అవసరాలను కూడా ఈ ప్రాజెక్టు నుంచే తీరుస్తున్నారు.

అక్కరకు రాని ఆధునికీకరణ పనులు

గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏలేరు ఆధునికీకరణకు రూ.270 కోట్లు కేటాయించారు. మొదటి విడతగా రూ.129 కోట్లతో పనులు చేశారు. 15 రెగ్యులేటర్లు, 15 ఒటి స్లాబ్ స్లూయిజ్‌లు, 20 పైప్ ఓటీ స్లూయిజ్‌లు, ఒక క్రాస్ రెగ్యులేటర్ల నిర్మాణంతో పాటు కాలవ గట్టు పటిష్టత పనులు నిర్వహించారు. అయితే ఆ పనుల్లో నాణ్యత లేక మళ్లీ సమస్యలు మొదలయ్యాయి. 2020 లో వచ్చిన వరదలకు ప్రధాన కాలువ పొడవునా 50 వరకూ గండ్లు పడ్డాయి. అప్పట్లో వచ్చిన వరదలకు సుమారు 20 వేల ఎకరాల్లో పంటలకు పూర్తి నష్టం జరిగింది. ఎకరానికి రూ. 40 వేలు పెట్టుబడి ఖర్చులు అవ్వగా రూ.80 కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లింది. పడిన గండ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. మళ్లీ భారీ వరదలు వస్తే పరిస్థితి పునరావృతం అయ్యే అవకాశం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. మరోవైపు ఏలేరు ప్రధాన పంట కాలువపై పలు చోట్ల ఆక్రమణలు జరిగాయి. సుమారు 100 మీటర్ల వెడల్పు ఉండవలసిన కాలవ 20 మీటర్లకు తగ్గిపోయింది. దీంతో సాధారణ రోజుల్లో పొలాలకు సక్రమంగా నీరందక ఎండిపోతున్నాయి. ఆక్రమణలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు కూడా ఏలేరు ఆధునికీకరణను పట్టించుకోలేదు. ఫేజ్ 1లో మిగిలి ఉన్న 40 శాతం పనులకు, ఫేజ్ 2లో పనులకు రూ.294 కోట్లు కేటాయిస్తామని 2022లో జులైలో గొల్లప్రోలులో నిర్వహించిన కాపు నేస్తం సభలో ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. ఈ పనుల్లో భాగంగా సుద్దగడ్డ కాలువను ఆధునికీకరించేందుకు కిర్లంపూడి మండలం ముక్కొల్లు నుంచి పిఠాపురం వరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.200 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే ఆధునికీకరణ పనులకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవనే వాదనలు వినిపిస్తున్నాయి. నిధుల విడుదల ఎప్పుడు చేస్తారు... పనులు ఎప్పుడు మొదలు పెడతారు అనేవి మాత్రం ప్రకటించలేదు. ఫలితంగా నేటికీ నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

ప్రతి ఏటా నష్టాలే...

ఏటా అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నడుమ తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. అప్పులు చేసి పంటలకు పెట్టుబడులు పెడుతున్న తరుణంలో చివరి దశలో వరదలు ముంచెత్తి ఆశలన్నీ నీళ్ల పాలవుతున్నాయి. ఎన్నికల సమయాల్లో మాత్రమే పాలకులకు ఏలేరు ఆధునీకరణ మాట గుర్తొస్తుంది. అటు అధికారులూ పట్టించుకుంటున్న పాపాను పోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఆధునీకరణ పనులు అరకొరగా జరిగినా అక్కరకు రాలేదు. ఈ ప్రభుత్వ హయాంలో హామీలు ఇచ్చినా అమలు జరగడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఏటా నష్టాలే మిగులుతున్నాయి...

ఏలేరు ఆధునికీకరణ అనేకఏళ్లుగా లేకపోవడంతో ప్రతి ఏటా నష్టాలే మిగులుతున్నాయి. పాలకులు ప్రతి ఎన్నికల్లోనూ ఆధునికీకరణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని హామీలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం ఉండట్లేదు. ఇప్పటికైనా ఆధునికీకరణ పనులు చేపట్టి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

- వీరమళ్ల నూకరాజు, రౌతుపాలెం, ప్రత్తిపాడు మండలం

ఏలేరు ఆధునికీకరణ చేపట్టాలి

ఐదు మండలాల్లో పలు గ్రామాల రైతులు ఏలేరు ఆయకట్టు కింద సాగు చేస్తున్నారు. పిఠాపురం శివారు ఆయకట్టు కావడంతో ప్రతిసారీ అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయి. సాగునీరు పూర్తిస్థాయిలో ఎక్కడా అందడం లేదు. వరదలు వస్తే ముంపునకు గురవుతుంది. ఆధునికీకరణ లేకే ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా పాలకులు స్పందించాలి.

- కాయల పవన్‌కుమార్, గోకివాడ, పిఠాపురం

నామినేషన్ వేయాలిలా...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల్లో అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభమై ఇప్పటికే ఒకరోజు గడిచింది. నామినేషన్లను స్వీకరించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. సాధారణ రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 25 వరకూ నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 29 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు ఆయా నియోజకవర్గాల్లో ఎంత మంది బరిలో నిలుస్తారనేది అధికారికంగా ప్రకటిస్తారు.

రిటర్నింగ్ అధికారి నుంచి పొందాల్సిన పత్రాలు

- ఎన్నికల వ్యయాలను నమోదు చేసే రిజిస్టర్
- పరిశీలనకు హాజరయ్యేందుకు నోటీసు
- చెల్లించిన మొత్తానికి రసీదు
- కరపత్రాలు, గోడ పత్రికలు తదితర వాటిని ముద్రించుకునేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-127(ఎ) సంబంధిత సూచనల పుస్తకం
- నామినేషన్‌లోని లోపాలను జతపర్చాల్సిన సూచిక

ఎన్నికల నిబంధనలు ఇలా...

- నామినేషన్ల దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లను సమర్పించాలి.
- అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్న నామినేషన్లనే అనుమతిస్తారు.
- అభ్యర్థి నాలుగు సెట్ల వరకూ నామపత్రాలు సమర్పించొచ్చు.
- పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఎ, అసెంబ్లీ, నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలి.
- దీనికి రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కలిగిన ఫారమ్-26 ద్వారా ప్రమాణపత్రం(అఫిడవిట్) జతపర్చాలి.
- అఫిడవిట్‌ను నోటరీ చేయించాలి
- నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. స్వతంత్ర అభ్యర్థితో పది మంది వెళ్లవొచ్చు.
- నామినేషన్‌పత్రం సమర్పించే సమయంలో అభ్యర్థి ప్రమాణం చేయాల్సి ఉంటుంది.

నామినేషన్‌కు ఇవీ అర్హతలు

- నామపత్రాలు దాఖలు చేసే అభ్యర్థి వయస్సు 25ఏళ్లు నిండి ఉండాలి
- రాష్ట్రంలోని ఏదేని నియోజకవర్గంలో ఓటు హక్కును కలిగి ఉండాలి.
- ప్రతిపాదించే వ్యక్తులు అదే నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి
- జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరుపున పోటీ చేసేవారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థిని పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ధరావత్తు సొమ్ముగా ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.5వేలు, మిగిలిన అభ్యర్థులు రూ.10వేలు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు సంబంధిత అధికారి నుంచి పొందిన కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.
- అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. ఈ ఖాతా ద్వారానే ఎన్నికలకు ఖర్చుకు సంబంధించిన లావాదేవీలు జరపాలి. ఈ వివరాలను ఆర్‌ఒకు సమర్పించాలి

ఆన్‌లైన్ ద్వారా...

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో నామినేషన్ సమర్పించే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. సువిధ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. అనంతరం సదరు అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నుంచి అపాయింట్‌మెంట్ తేదీ వస్తుంది. అప్పుడు అభ్యర్థి లేదా ప్రతిపాదించే వ్యక్తులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలు అందించాలి.

అన్ని కాలమ్స్ నింపాల్సిందే...

నామినేషన్ అనేది అభ్యర్థి పోటీలో ఉంటారా? లేదా అనే నిర్ణయించే ప్రక్రియ. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు, రాబడి, ఖర్చులు, క్రిమినల్ కేసుల వంటి వివరాలు నమోదు చేయాలి. అడిగిన వివరాలు వర్తించకపోతే 'నాట్ అప్లికబుల్' అని రాయాలి. అఫిడవిట్‌లోని కాలమ్స్ అన్నీ తప్పనిసరిగా పూరించాలి. లేనిపక్షంలో సదరు అభ్యర్థికి ఆర్ఒ నోటీసులు జారీ చేస్తారు. నామినేషన్ల పరిశీలన తేదీకంటే ముందుగానే అన్ని కాలమ్స్ పూర్తి చేయిస్తారు. ఖాళీగా ఉంచితే నామినేషన్ పత్రం తిరస్కరణకు గురవుతుంది.

నేర చరిత్ర చెప్పాల్సిందే...

అఫిడవిట్‌లో అభ్యర్థి నేర చరిత్రను ప్రస్తావించాల్సి ఉంటుంది. ఫారమ్-సి1 ద్వారా రాజకీయ పార్టీలు, ఫారం- సి2 ద్వారా అభ్యర్థులు వేర్వేరుగా పేరొందిచీశీఅవంందిన వార్తా పత్రికల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది. స్వతంత్రులైతే వ్యక్తిగతంగా నేరచరిత్రను ప్రకటించాలి. ఇదే అఫిడవిట్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచుతారు. అందులోని వివరాలు సవ్యంగా లేకపోతే సదరు అభ్యర్థి ఎన్నికను న్యాయ స్థానంలో సవాలు చేయొచ్చు.

తొలి రోజు 19 మంది నామినేషన్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తొలిరోజైన గురువారం 19 మంది నామినేషన్లను వేశారు. అధికార పార్టీ వైసిపి నుంచి నలుగురు, టిడిపి నుంచి ఒకరు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. తొలిరోజు అత్యధికంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 8 మంది నామినేషన్లు వేశారు.

రామచంద్రపురం నుంచి పిల్లి సూర్యప్రకాష్...

రాజమండ్రిలో నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ అభ్యర్థిగా ఆదిరెడ్డి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్‌కు అందించారు. అలాగే వాసు భార్య ఆదిరెడ్డి భవానీ ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. వీరితో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ, చల్లా శంకర్రావు ఉన్నారు.

రామచంద్రపురంలో నామినేషన్ వేస్తున్న సూర్యప్రకాష్

రామచంద్రపురం : నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్ నామినేషన్ వేశారు. అభిమానుల భారీ ర్యాలీతో తరలి వెళ్లి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌ఒకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోసు, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, పార్టీ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరాజు, మున్సిపల్ కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తల జైసూర్యనారాయణబాపూజీ, పిల్లి సుభాష్ చంద్రబోస్ నామినేషన్లు దాఖలు చేశారు.

నిడదవోలులో నామినేషన్ పత్రాలు అందిస్తున్న నాయుడు

నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా జి.శ్రీనివాస్‌నాయుడు నామినేషన్ వేశారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వమించారు. గణేష్ చౌక్‌లో ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం ఆర్‌ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి.రమణనాయక్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, ఎంఎల్ఎ సతీమణి సుమలత, కుమారుడు వరుణ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో నామినేషన్ పత్రాలు అందిస్తున్న తలారి వెంకట్రావు

కొవ్వూరు రూరల్ అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజున ఇద్దరు అభ్యర్థులు రెండు నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి తరపున తలారి వెంకట్రావు నామినేషన్ వేశారు. అలాగే ఆయన భార్య తలారి పరం జ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. సబ్ కలెక్టర్ కొవ్వూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

గోపాలపురంలో ఆర్‌ఒకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న మద్దిపాటి

గోపాలపురం అసెంబ్లీ నియోజక వర్గానికి తొలి రోజున టిడిపి తరపున మద్దిపాటి వెంకటరాజు నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన ద్వారకా తిరుమల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి, మాజీ మంత్రి కెఎస్.జవహర్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, జనసేన పార్టీ ఇంచార్జ్ సువర్ణరాజు, రూపాదేవి పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ప్రముఖ వైద్యులు, డాక్టర్ .పితాని అన్నవరం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పితాని అన్నవరం నామినేషన్ దాఖలు చేశారు. వైసిపి నుంచి టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డ ఆయన పార్టీకి రాజీనామా చేశారు. నామినేషన్ దాఖలు సందర్భంగా స్థానిక రామారావు పేటలోని రమ్య ఆసుపత్రి నుంచి రూరల్ తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మండపేట : స్థానిక ఆర్‌ఒ కార్యాలయంలో నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రారంభమైంది. మొదటి రోజు స్వల్పంగా కేవలం 3 నామినేషన్లు మాత్రమే నమోదయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కోన సూర్యభాస్కర్‌రావు, మార్ని సత్యనారాయణ, నవతరం పార్టీకి చెందిన నందికోళ్ల రాజు నామ పత్రాలు సమర్పించారు.

టిడిపికి పైలా రాజీనామా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన కుటుంబం టిడిపిలోనే కొనసాగిందని, అయితే టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి పరుపుల సత్యప్రభ ఒంటెద్దు పోకడ నచ్చకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబు స్వయంగా చెప్పినప్పటికీ ఆమెలో మార్పు రాలేదన్నారు. తన అనుచరులతో చర్చించి తన రాజకీయ భవష్యత్‌పై నిర్ణయం తీసుకుంటానని అన్నారు. ఈ సమావేశంలో ముచ్చి అప్పలరాజు, వాగు రమేష్, సచివాడ రాజేష్ పాల్గొన్నారు.